పాపాగారి శంకర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బాధిత కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

రాజన్న సిరిసిల్ల, మే 28 (నమస్తే తెలంగాణ)/ గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రేణుక ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం అనారోగ్యానికి గురైన మాజీ సర్పంచ్ పాపాగారి భూలక్ష్మి భర్త శంకర్‌గౌడ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నేతలు దయాకర్‌రావు, లక్ష్మణ్, కమలాకర్‌రావు, నర్సాగౌడ్, సురేందర్‌రెడ్డి, పెద్దవేని వెంకటియాదవ్, గంధ్యాడపు రాజు, రామాంజగౌడ్, మోతె రాజిరెడ్డి, గడ్డి హరీశ్, జంగంపల్లి శేఖర్‌గౌడ్, పాపాగారి శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం ఉన్నారు.

సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ కేసులు

సైలెన్సర్లు ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిక
- అధిక శబ్దం చేసే 86 బైక్ సైలెన్సర్లు ధ్వంసం

సిరిసిల్ల తెలంగాణ చౌక్, మే 28 : ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం చేసేలా సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 86 బైక్ సైలెన్సర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ ప్రాంతంలో రోడ్డు రోలర్ సాయంతో ధ్వంసం చేయించి, మాట్లాడారు. నెల రోజుల వ్యవధిలో నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ సైలెన్సర్ల స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. అందులో 86 వాహనాలను గుర్తించి, మారోసారి వినియోగించకుండా సైలెన్సర్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అధిక శబ్దం చేసే సైలెన్సర్లు బిగించే మెకానిక్‌లపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే, పోలీస్ సైరన్లు బిగించిన ఐదు వాహనాల యజమానులపై కేసు నమోదు చేసి, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్ ఉన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

వేములవాడ, మే 28: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జూన్ 8, 9 , 10 తేదీల్లో నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఇక్కడ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు ప్రశాంత్, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, గుర్రం అశోక్, చిర్ర వేణు, శ్రీకాంత్, కుమార్, తదితరులు ఉన్నారు.

విత్తన ఎంపికే కీలకం

- అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి
- నకిలీవి కొని మోసపోవద్దు
- అవగాహన కల్పించిన వ్యవసాయశాఖ అధికారులు

వేములవాడ రూరల్: మర్రిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో అనూష

వానకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో అన్నదాతలతో అవగాహన సదస్సులు నిర్వహించారు. సాగులో విత్తన ఎంపికే కీలకమని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. విత్తనాలు కొన్న తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, నకిలీవి కొనుగోలు చేసి మోసపోవద్దని అవగాహన కల్పించారు. ఎవరైనా ఎక్కువ ధరకు గానీ, నకిలీ విత్తనాలు గానీ విక్రయించినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

– బోయినపల్లి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట/ముస్తాబాద్/ రుద్రంగి, మే 28

- బోయినపల్లి మండలం అనంతపల్లి, గుండన్నపల్లి, రత్నంపేట, మల్లాపూర్, వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో రైతులకు పంటల సాగుతోపాటు, విత్తనాల ఎంపికపై ఏవో ప్రణీత అవగాహన కల్పించారు. లైసెన్స్ కలిగిన ఫెస్టిసైడ్, ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, మందులు కొనుగోలు చేయాలని కోరారు. ఇక్కడ ఏవోలు శ్రీదేవి, రజిత, తదితరులు ఉన్నారు.
- కోనరావుపేట మండలం బావుసాయిపేటలోని రైతువేదికలో రైతులకు విత్తనాల ఎంపికపై ఏఈవో స్రవంతి అవగాహన కల్పించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనాలని సూచించారు. అలాగే మర్తనపేటలో ఏఈవో హేమాజి విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు.
- వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, నాగయ్యపల్లి గ్రామాల్లో విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏఈవో అనూష అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ సుమన్, రైతులు ఉన్నారు.
- ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో రైతులకు విత్తనాల ఎంపిక, సాగులో మెళకువలపై ఏవో సురేశ్‌రెడ్డి అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలను రైతులు తడిగుడ్డలో గానీ, తడిసిన ఇసుకలో గానీ పెట్టి మొలక శాతం, నాణ్యతను పరిశీలించుకోవచ్చన్నారు. ఇక్కడ ఏఈవో గంగ, జీపీ క్యాదర్శి రాజయ్య, కారోబార్ ప్రకాశ్, తదితరులు ఉన్నారు.
- ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులతో వ్యవసాయశాఖ అధికారులు సమావేశమయ్యారు. నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంకటాపూర్‌లో విత్తన డీలర్ షాపును తనిఖీ చేశారు. ఇక్కడ ఏఈవో లక్ష్మణ్, ముకుంద్, తదితరులు ఉన్నారు.
- ముస్తాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం సొసైటీలు, అగ్రోస్, ప్రైవేట్ విత్తన, ఎరువుల డీలర్ల దుకాణాదారులతో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ సమావేశమై, వారికి పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని, స్టాక్, బిల్ బుక్‌లు తప్పకుండా రోజువారీగా నమోదు చేయాలని సూచించారు. అంతకుముందు పలు దుకాణల్లో తనిఖీలు చేశారు.
- రుద్రంగి మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులలో మండల వ్యవసాయ అధికారి దుర్గరాజ్ తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ప్రకారం విత్తనాలు, ఎరువులు అమ్మాలని షాపు యజమానులకు సూచించారు. ఇక్కడ ఏఈవో విజయ్, ఫర్టిలైజర్ షాపు యజమానులు ఉన్నారు.

ముస్తాబాద్: సమావేశంలో డీలర్లు, దుకాణాదారులకు సూచనలు చేస్తున్న ఏవో వెంకటేశ్

'బెస్ట్ అవైలబుల్' స్కూల్స్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

కలెక్టరేట్, మే 28: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ఒకటో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతికి 46సీట్లు కేటాయించినట్లు తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ స్కీమ్‌లో విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని వెల్లడించారు. విద్యార్థులు జిల్లాకు చెందినవారై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ పరిధిలో ₹2లక్షలు, గ్రామ పరిధిలో ₹1.50 లక్షలకు మించి ఉండవద్దన్నారు. ఈ పాఠశాలలో చేరే విద్యార్థులు 1జూన్2018 నుంచి 31మే2019 మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులన్నా రు. ఈ నెల 29 నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో కలెక్టరేట్‌లో దరఖాస్తులు లభిస్తాయన్నారు. జూన్ 15న విద్యార్థులను లాటరీ ద్వారా కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం షెడ్యూల్డ్ కులాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, మే 28: ఐటీఐలో మొదటి విడుత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో వెబ్‌సైట్‌లో (http://iti.telangana.gov.in) అప్లై చేసుకోవాలన్నారు.

రేపు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, మే 28: రాజన్న ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు ఆలయ ఓపెన్ స్లాబ్‌పై నిర్వహించే హుండీ లెక్కింపునకు అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ముస్తాబాద్, మే 28: ఈదురుగాలులతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల గాలివాన బీభత్సవానికి రామలక్ష్మణపల్లె, తుర్కపల్లెతోపాటు పలు గ్రామాల్లో పలువురి ఇండ్ల పై కప్పులు ఎగిరిపోగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండలాధ్య క్షుడు బొంపెల్లి సురేందర్‌రావుతో కలిసి మంగళవారం పరామర్శించారు. జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే కేటీఆర్‌కు దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని వారికి భరోసానిచ్చారు. ఇక్కడ సెస్ మండల డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

యూనిఫామ్స్ అందించాలి

రుద్రంగి, మే 28: పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫామ్స్ అందించాలని డీఆర్డీవో శేషాద్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. యూనిఫామ్స్ కట్టింగ్, స్టిచ్చింగ్, కాజా బటన్స్‌ను తనిఖీ చేశారు. మహిళా శక్తి కుట్టు కేంద్ర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి నిర్వహకులు కల్పన, రోజాను అభినందించారు. ఇక్కడ ఏడీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం సుధారాణి, ఏపీఎం రాజు, సీసీలు వెంకటలక్ష్మి, పరశురాములు, తదితరుఉన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 28: హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకుని హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ నగరేశ్వరాలయం నుంచి భక్తులు శోభాయాత్ర చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు హనుమంతుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం ఆయన బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, నాయకులు సంగె స్వామి, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, నామాల లక్ష్మీరాజం, పుల్కం రాజు, దాడి మల్లేశం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోనరావుపేట, మే 28: వెంకట్రావుపేటకు చెందిన మారుపాక రాజవ్వ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సదరు కుటుంబానికి రూ.10వేలు అందించారు. ఇక్కడ మండలాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం, జిల్లా కార్యదర్శి సురేందర్‌రావు, నేతలు రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, జితేందర్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్ననాయకులు

'ప్రత్యామ్నాయ' సాగును ప్రోత్సహించాలి

- అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్
- పంటల సాగుపై ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్, మే 28: ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేదిశగా రైతులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం పంటల సాగుపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ మాట్లాడుతూ, గత యాసంగిలో జిల్లాలో మొత్తం 1,78,574ఎకరాలు సాగు జరిగిందని, ఇందులో అత్యధికంగా 97.8శాతం మేర వరి వేశారన్నారు. రాబోయే సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌పామ్, పండ్ల పెంపకం, కూరగాయల సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీని రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసచారి, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి జ్యోతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'అర్బన్ బ్యాంకు'లో నామినేషన్ల జోరు

పదో డివిజన్ నుంచి నామినేషన్ దాఖలు చేస్తున్న వలుస హారిణి

రాజన్న సిరిసిల్ల, మే 28 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకులో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరందుకున్నది. రెండో రోజు 34నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజు 23నామినేషన్లు రాగా, రెండు రోజుల్లో మొత్తం 57 నామినేషన్లు వచ్చాయి. మొత్తం 12 డైరెక్టర్ స్థానాలుండగా, అందులో రెండు స్థానాలు (7, 10 డివిజన్‌లు) మహిళలకు రిజర్వేషన్ అయ్యాయి. 5వ డివిజన్ ఎస్సీ, ఎస్టీ జనరల్‌కు, మిగిలిన తొమ్మిది స్థానాలు జనరల్‌కు కేటాయించారు. 6న జరిగే ఎన్నికల్లో డైరెక్టర్ స్థానాలకు పోటీ చేసేందుకు మహిళలు సైతం పెద్దఎత్తున పోటీపడుతున్నారు. నామినేషన్ల ఘట్టం బుధవారంతో ముగియనున్నది. చైర్మన్ స్థానాలను ఆశిస్తున్న ప్రముఖులు చివరి రోజు అయిన బుధవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- మామిడిపల్లిలో గ్రామస్తులు, పశువులకు గాయాలు

కోనరావుపేట, మే 28: మామిడిపల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని ఊరడి సాయిమల్లయ్య, జవ్వాజి రాజయ్య, మారుపాక చంద్రయ్యతోపాటు లోకుర్తి మల్లయ్య, పండుగ లచ్చయ్య, తీపిరెడ్డి వేణురెడ్డి అనే రైతుల పశువులు, మేకలపై దాడి చేసింది. గ్రామస్తులు వెంటనే స్పందించి పలువురిని కుక్క బారినుంచి రక్షించారు. గాయపడిన వారు వెంటనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు వేయించుకున్నారు. పశువులకు ప్రైవేట్ వైద్యులు టీకాలు వేశారు. అలాగే ఊరడి సాయిమల్లయ్య అనే వృద్ధుడు ఇంటి సమీపంలో నిద్రిస్తుండగా తల భాగంలో తీవ్రం గా గాయపర్చడంతో అతడిని సిరిసిల్ల ఏరి యా దవాఖానకు తరలించారు. అనంతరం గ్రామస్తులు కుక్కను వెంబడించి చంపివేశారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువవుతున్నదని, వాటి నుంచి రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగుడుకు బానిసై.. కుటుంబపోషణ భారమై..

ముస్తాబాద్, మే 27: తాగుడుకు బానిసై.. కుటుంబపోషణ భారం కావడంతో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిప్పలపల్లిలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సాదల శంకర్(45) కొద్ది రోజులగా తాగుడుకు అలావాటు పడడం తో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విర క్తి చెంది సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ సోదరుడు లింగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.యూత్ సభ్యులు, దాతల సహకారంతో అంత్యక్రియ లు నిర్వహించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం చేయుతనివ్వాని మాజీ సర్పంచ్ దేవయ్య కోరారు. బాధిత కుటుంబానికి చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు, విద్యాసాగర్‌రావు ₹10వేలు, మాచేటి లచ్చయ్య ₹5వేలు, జూకంటి హనుమంతరావు ₹5వేలు, మాజీ సర్పంచ్ తాడప జ్యోతి ఎల్లం ₹3వేలు అందించారు.

రైతులకు ₹500 బోనస్ ప్రకటించాలి

సిరిసిల్ల రూరల్, మే 28: రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాల్‌కు ₹500 బోనస్ అందించాలని సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగిల్‌విండో పరిధిలోని 20సెంటర్లలో రైతుల నుంచి 1,67,022 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని, ఇందుకు సహకరించిన పాలకవర్గం, రైతులు, ప్రజాప్రతినిధులు, హమాలీలకు కృతజ్ఞతలు తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిన ప్రభుత్వం ₹500 బోనస్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతుల పంటకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు.

మురుగు కాలువ క్లీన్

ఎక్స్‌కవేటర్‌తో మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు

నమస్తే ఎఫెక్ట్

కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న మురుగు కాలువలో నీరు నిలిచి దుర్వాసన రావడంతో 'కంపుకొడుతున్న కాలనీలు' శీర్షిక 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో మండల అధికారులతోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ స్పందించారు. క్షేత్రస్థాయిలో గ్రామానికి వెళ్లి నిలిచిన మురుగుతోపాటు కాలువను ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రం చేయించారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో మురుగు కాలువ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇబ్బంలేకుండా చూస్తామని అధికారులు హామీఇవ్వడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

– కోనరావుపేట, మే 28

కాలువ తవ్వారు.. మరమ్మతులు చేయించారు

- 'నమస్తే' కథనానికి స్పందన

పైపులైన్ మరమ్మతు చేయిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని ఎనిమిదో వార్డులో తాగునీటి కోసం మహిళలు ఖాళీబిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. దీంతో 'తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు' శీర్షిక 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించారు. పొద్దుపొద్దు నే గ్రామానికి చేరుకుని తాగునీటి సమస్యను గుర్తించారు. వెంటనే తాగునీటి పైపులను మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు పైపు లైన్ మరమ్మతులు పూర్తయ్యే వరకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఇక్కడ గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, ఎంపీడీవో శశికళ, ఎంపీవో మీర్జా, ఏపీవో శ్రీనివాస్, జీపీ కార్యదర్శి కవిత ఉన్నారు.

– కోనరావుపేట, మే 28

హరితహారం చెట్లు తగలబెట్టినందుకు ₹6వేల జరిమానా

రైతుకు జరిమానా రసీదు అందజేస్తున్న ఏపీవో, కార్యదర్శి

కోనరావుపేట మండలం నిజామాబాద్, కనగర్తి గ్రామాల మధ్యలో రోడ్డు వెంబడి ఉన్న హరితహారం చెట్లు కాలిపోయాయి. హరితహారం చెట్లు అగ్నికి ఆహుతి శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైంది. దీంతో మండల అధికారులతోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందించారు. అగ్నికి ఆహుతైన చెట్లను పరిశీలించారు. నోముల సదాశివరెడ్డి అనే రైతు పంట వ్యర్థాలను తగలబెట్టే క్రమంలో 12చెట్లు కాలిపోయినట్లు గుర్తించారు. ఒక్కో చెట్టుకు ₹500 చొప్పున రూ.6వేలు జరిమానా విధించారు. అలాగే కాలిపోయిన 12చెట్ల స్థానంలో ఐదు రేట్ల చొప్పున 60మొక్కలు నాటాలని సదరు రైతుకు సూచించారు. అనంతరం ₹6వేల జరిమానా రసీదును ఏపీవో శ్రీనివాస్, జీపీ కార్యదర్శి కవిత రైతుకు అందజేశారు.

– కోనరావుపేట, మే 28

క్రీడా పోటీలు విజయవంతం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ

ఇల్లంతకుంట, మే 28: దోస్తీమీట్ క్రీడా పోటీలు విజయవంతమైనట్లు రూరల్ సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు గత గురువారం నుంచి సోమవారం రాత్రి వరకు మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ వేడుకలకు సీఐ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడలపై యువతలో ఆసక్తి పెంచడానికే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వాలీబాల్‌లో వంతడుపుల, రేపాక, కబడ్డీలో రేపాక, గాలిపల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, క్రీడాకారులకు బహుమతులు అందించారు. దోస్తీ మీట్ క్రీడలను విజయవంతం చేసిన క్రీడాకారులకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఎస్ఐ రాజుగౌడ్, సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429
★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194